క్లుప్తంగా

రతన్ టాటాకు ఘన నివాళి



రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చాంబర్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: సంపాదనే ముఖ్యం కాదని సంపాదించిన సంపాదనలో సగం సేవకే ఖర్చు చేసిన మహనీయుల్లో రతన్ టాటా ఒకరని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహారావు అన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త టాటా గ్రూప్ ఛైర్మన్ రతన్ టాటా మృతి పట్ల ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో గురువారం రాత్రి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నరసింహారావు మాట్లాడుతూ రతన్ టాటా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సెక్రటరీ కనుమూరి వెంకట సీతారామరాజు, ట్రెజరర్ మామిడి వెంకటేశ్వరరావు, యినకొండ రంగారావు, కొరగింజల రవి శంకర్, నెలకుర్తి సత్యనారాయణమూర్తి, కె.జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి లోడులతో ఇబ్బందులు బోలెడు

- రోడ్డు మీదనే కొబ్బరి ఎగుమతులు
- కొబ్బరి లారీల తాకిడితో ట్రాఫిక్ జామ్
- అధికారుల స్పందన అంతంత మాత్రమే



యలమంచిలిలో రోడ్డు మీద ట్రాక్టర్ నిలిపి కొబ్బరికాయలు ఎగుమతి చేస్తున్న దృశ్యం

యలమంచిలి: వాహనాల రద్దీ, గతుకులు, ఇరుకు రోడ్లతో సతమతమవుతున్న ప్రజానీకానికి భారీ లోడుతో వెళుతున్న కొబ్బరి లోడు లారీలు అనునిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా మేడపాడు నుంచి మండల కేంద్రం యలమంచిలి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో పదుల సంఖ్యలో కొబ్బరికాయల దుకాణాలు ఉన్నాయి. ప్రతి రోజూ ఇక్కడ నుంచి పదుల సంఖ్యలో కొబ్బరికాయ ఎగుమతి చేసుకుని లారీలు ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటాయి. కొబ్బరికాయలు లారీలోనికి ఎగుమతి చేసే సమయంలో రోడ్డు మీదనే వాహనం నిలిపి ఎగుమతి చేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుకయ్యి ప్రతి రోజు ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ఒక్కోసారి లారీలకు ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడితే రోడ్డు మీదనే నిలిచిపోవడం ప్రయాణికులకు శాపంగా మారుతుంది.

పట్టించుకోని అధికారులు

ఇరుకు రోడ్డు కావడంతో కొబ్బరి లోడుతో లారీ వెళుతున్న సమయంలో దానిని తప్పించాలంటే సుదీర్ఘ సమయం ప్రయాణించిన తర్వాత ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే అధిక లోడుతో వెళుతున్న వాహనాన్ని అధిగమించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక టన్నులతో ప్రతి రోజు ఉదయం వేళల్లో పదుల సంఖ్యలో లారీలు ప్రయాణించడం వల్ల వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవతున్నారు. అధిక లోడును నివారించాల్సిన ఆర్‌టీఓ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రవాణాశాఖ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. కొబ్బరి కాయలు రవాణా చేసే లారీ యజమానులకు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కొబ్బరి లారీలే కాకుండా ప్రతి రోజు ఉదయం సాయంత్రం ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల బస్సులు కూడా పదుల సంఖ్యలో తిరుగుతున్నాయి. అయితే వాటిలో చాలా వాహనాలు కాలం చెల్లిపోవడంతో పొగకక్కుకుంటూ వెళ్తున్నాయి. దీంతో ఆ వాహనాల వెనుక వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలం చెల్లిన వాహనాలు రోడ్లపై తిరగకుండా కఠిన చర్యలు తీసుకుంటే పర్యావరణాన్ని రక్షించుకోవచ్చనే అభిప్రాయం పర్యావరణవేత్తల నుంచి వ్యక్తమవుతుంది. అధిక లోడు వాహనాల ప్రయాణం నివారిస్తే ప్రమాదాలు తగ్గడంతో పాటు వాహనదారులకు ప్రయాణం సులభతరం అవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

బాణసంచా వ్యాపార లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

నరసాపురం: దీపావళి సందర్భంగా నరసాపురం డివిజన్‌లో బాణసంచా విక్రయాలకు సంబంధించి తాత్కాలిక లైసెన్సులు జారీ చేస్తామని ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. బాణసంచా వ్యాపారాలకు సంబంధించి తాత్కాలిక లైసెన్సుల కోసం ఈ నెల 26వ తేదీలోగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తుతో పాటుగా ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్సులు, చలానా జత చేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించి బాణసంచా విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జయజయహే మహిషాసురమర్దని



నరసాపురం: పండ్ల మార్కెట్ వద్ద మహాగౌరీదేవి అలంకరణ



మొగల్తూరు: మహిషాసురమర్దనిగా కనకదుర్గమ్మ



పెనుగొండ: మహిషాసురమర్దనిగా మూలవిరాట్ వాసవీ మాత



పాలకొల్లు సెంట్రల్: ఆకట్టుకున్న మహిషాసురమర్దని అలంకరణ



నరసాపురం రూరల్: చామకూరిపాలెంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణంలో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. పండ్ల మార్కెట్ వద్ద 40వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ, గునిశెట్టి శ్రీను, చిట్టూరి కృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాయిపేట పుంతలో ముసలమ్మ అలయం వద్ద, గోల్డ్ మార్కెట్ వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్న మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబజార్ వలవలవారివీధిలో భద్రాద్రి రామసాయిమందిర్‌లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. వలవల సురేష్ దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కొండాలమ్మ, నాగారమ్మ, గడ్డిబజార్‌లోని దుర్గాదేవి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

మొగల్తూరులో...

మొగల్తూరు: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని మహిషాసురమర్దని దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక భవానీ కాలనీలోని కనకదుర్గమ్మ, పార్వతీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పేరుపాలెం నార్త్ గ్రామంలోని అమ్మవారి ఆలయంలో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కుంకుమ పూజలో పాల్గొన్నారు. రామన్నపాలెం, శేరేపాలెం ,కొత్తపాలెం, కాళీపట్నం, పాతపాడు, జగన్నాదపురం, కేపీ పాలెం నార్త్, సౌత్,పేరుపాలెం సౌత్ గ్రామాల్లోని ఆలయాల్లోను ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల వేడుకలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద ఉన్న పందిళ్లలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చామకూరిపాలెంలోని ముత్యాలమ్మ వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమ వద్ద మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. కొప్పర్రులో గ్రామ దేవతలకు గ్రామానికి చెందిన ఆడపడచులు సారె, చీరలను అందజేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. చిట్టవరం, వేములదీవి, కొపులకొడప, సరిపల్లి, లిఖితపూడి, కె బేతపూడి, లక్ష్మణేశ్వరం, యర్రంశెట్టివారి పాలెం, పితానిమెరక, పసలదీవి గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెనుగొండలో..

పెనుగొండ: శ్రీదేవీ శరన్నవరాత్రులు సందర్భంగా శుక్రవారం ఆచంట, పెనుగొండ మండలాల్లో అమ్మవార్లు మహిషాసురమర్దని దేవిగా దర్శనం ఇచ్చారు. పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మూల విరాట్ వాసవీ మాత, మహిషాసురమర్దని అమ్మవార్లు మహిషాసురమర్దని దేవిగా అలంకరించారు. అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధామ్‌లో మరకత శిల వాసవీ మాతను మహిషాసురమర్దనీ మాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. సిద్ధాంతం దేవి సెంటర్‌లో భవానీ మాలధారులు, మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవిశరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించారు. అలాగే స్వామివారిని కూడా ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక యడ్లబజారు సెంటర్ నందు కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు కుంకుమపూజలు నిర్వహించారు. స్థానిక బంగారు వారి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమ్మవారిని జోగులాంబ దేవిగా అలంకరించారు. పట్టణ పుర వీధుల్లో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మండపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు ప్రతీ మండపంలో అమ్మవారికి కుంభం వేసి నైవేద్యం సమర్పించారు.

నరసాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు

నరసాపురం: దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని నరసాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌కు 12న ఒక సూపర్‌లగ్జరీ, 13న 3 సూపర్‌లగ్జరీబస్సులు, ఒక ఎక్స్‌ప్రెస్, 14న 2 సూపర్‌లగ్జజరీ బస్సులు అదనంగా తిప్పుతున్నామని చెప్పారు. 13న విశాఖపట్టణానికి ఒక సూపర్‌లగ్జరీ బస్సు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని చెప్పారు. రద్దీని బట్టి ఎన్ని సర్వీసులు అవసరమైతే అన్ని సర్వీస్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని చెప్పారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

నేడు పుస్తకావిష్కరణ

నరసాపురం: పేరాల రామలింగేశ్వరరావు శత జయంతి పురస్కరించుకుని ఆయన రచించిన శ్రీకృష్ణ కల్యాణ కింకిణి అనే రుక్మిణీ కల్యాణ పద్య కావ్యం ద్వితీయ ముద్రణ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం వైఎన్ కళాశాలలో ఏర్పాటు చేసినట్టు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వ్యక్తిగత సహాయకుడు పేరాల మోహన్ చెప్పారు. సాయంత్రం 5.30 గంటలకు జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి చేతులమీదుగా పుస్తకావిష్కరణ ఉంటుందని చెప్పారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత బేతవోలు రామబ్రహ్మం ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

కుటుంబ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి



ఆచంట వేమవరంలో ఐక్యత ఫ్యామిలీ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రతి ఒక్కరూ కుటుంబ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శుక్రవారం ఆచంట వేమవరంలో ఐక్యత ఫ్యామిలీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాలుగుతరాలకు చెందిన కుటుంబ సభ్యులు హజరై ఆప్యాయతలను పంచుకున్నారు. కార్యక్రమంలో మత్తే బాబ్జీ, నేతల సాల్మన్‌రాజు, ఉద్దా కస్తూరి భావన సూర్యకళ, గుండే రవికుమార్, యాదాల కిరణ్‌కుమార్, బల్లి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేవు ఇలా.. నిమజ్జనం ఎలా?



బాబా ఆలయం ఎదురుగా కాలువ రేవులో ఏర్పాటు చేసిన స్టీల్ గ్రిల్స్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని లాకు సెంటర్ నుంచి పెంకుళ్లపాడు టిడ్కో గృహాల మార్గంలో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద ఉన్న కాలువ రేవులో నిమజ్జనాలు ఎలా చేసుకోవాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ఈ రేవు వద్ద ఇటీవల స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. నిమజ్జనం చేయడానికి వీలు లేకుండా ప్రమాద హెచ్చరిక రాడ్లను అవసరం లేకపోయినా మరింత ఎత్తు పెంచుతూ నిర్మాణం చేయడం వల్ల నిమజ్జనం చేయడానికి వీలు లేకుండా ఉందని ఉత్సవ కమిటీల సభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయితే ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా కాలువపై ఇలాంటి నిర్మాణం చేయాలంటే అనుమతులు ఉండాలన్నారు. వెంటనే సిబ్బందిని పంపించి నిమజ్జనానికి అడ్డుగా ఉన్న రాడ్లను తొలగిస్తామని చెప్పారు.

కందరవల్లిలో డ్రెయినేజీ సమస్య పరిష్కారం

పెనుగొండ: రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నల్లిరాజేష్ విజ్ఞప్తి మేరకు ఆచంట మండలం కందరవల్లిలో డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపారని మలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు సరేళ్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కందరవల్లిలో డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి పనులు ప్రారంభించారని వివరించారు. స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆచంట మండల అధ్యక్షుడు రావి నాగరాజు, బత్తుల రాముడు, రావి వెంకటేశ్వరరావు, రావి ఈశ్వర్ పాల్గొన్నారు.

నిత్యావసరాల స్టాల్ ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: వినియోగదారులకు సరసమైన ధరలకే టమాట, ఉల్లిపాయలు వంటనూనెలు అందించాలనే ఉద్దేశంతో పట్టణంలో తక్కువ ధరలకే నిత్యావసరాలను అందించేలా స్టాల్‌ను ఏర్పాటు చేశా మని నరసాపురం ఆర్‌డీవో దాసి రాజు అన్నారు. పట్టణంలోని గజలక్ష్మి లాడ్జి ఎదురుగా మునిసిపల్ కాంప్లెక్స్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, తహసీల్దార్ వై దుర్గాకిషోర్, మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి, సీఎస్‌డిటీ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

భీమవరం: అనారోగ్యం కారణంగా ఆత్మహత్యాయత్నం చేసిన మహిళలను భీమవరం టుటౌన్ పోలీసులు తక్షణం స్పందించి రక్షించారు. దీనికి సంబంధించిన వివరాల ప్రకారం ఉండి మండలం చెరుకువాడ కాపులపేటకు చెందిన ఎం.శివలక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్‌కు దగ్గరలోని టాక్సీస్టాండ్ వద్ద యనమదుర్రు డ్రెయిన్‌లోని దూకింది. సమాచారం తెలిసిన పోలీసులు వెంటనే స్పందించి కాలిబాట వంతెన వద్ద తాళ్ల సహాయంతో ఆమెను ఒడ్డుకుచేర్చారు. అనంతరం ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు. మహిళను రక్షించిన హెడ్‌కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసులును పలువురు అభినందించారు.